## 14. గణేష్ ధూంధాం

"**సెప్టెంబరు** 13 నాడు మా అబ్బాయికి ఒక పోటీ పరీక్ష ఉంది. దానికి ప్రిపేరవడానికి ఇక్కడ సదుపాయంగా ఉండదనీ, విశాఖపట్నం వచ్చి పది రోజులపాటు మీ ఇంట్లో ఉండి చదువుకుంటాననీ అంటున్నాడు" ఆగస్టు 28 నాడు వచ్చింది ఉత్తరం. మా అన్నయ్యగారి అల్లుడు హైదరాబాదు నుండి రాసేడు.

అబ్బాయి దినేష్ 30వ తేదీ ఉదయం దిగేడు. "అవునూ, ఏదో పరీక్షకి చదువుకుంటావుటగా, లైబ్రరీల దగ్గర్నించీ కోచింగ్ సెంటర్ల దాకానూ, సలహాలూ, సహాయం అందించే కొలీగ్సు దాకానూ, హైదరాబాదులోనే అవకాశాలు ఎక్కువ కదా, ఇక్కడి కొచ్చి పడ్డావేమిటి?" అన్నాను.

"అక్కడ చదువు సాగదు తాతగారూ! మీకేదో పనుండి హైదరాబాద్ వెళ్తున్నారుటగా, మీరే చూడండి" అని దినేష్ కాలకృత్యాలు తీర్చుకోడానికి బాత్‌రూంకి వెళ్ళేడు.

"పిల్లాడు శ్రద్ధగా చదువుకుందామని వొస్తేనూ, ఇక్కడికెందుకొచ్చేవని అడుగుతారేమిటి? హవ్..... వ్వ! వాడు పదిరోజులిక్కడుంటే మీ సిరిసంపదలన్నీ తరిగిపోతాయా?" అని మా ఆవిడ నామీద కలియబడింది.

❖ ❖ ❖

ఆగస్టు 31 ఉదయం హైదరాబాదు చేరేను. సికింద్రాబాదులో రైలు దిగినా మా అన్నయ్యగారబ్బాయి ఇంటికి వెళ్ళడానికి ఖరాగా గంటన్నర టైము పట్టింది. ఏ రోడ్డు మీద చూసినా గణపతి పందిళ్ళు ట్రాఫిక్‌కి అడ్డంగా ఉన్నాయి. వాహనాలు తిరగడానికీ నడిచేవాళ్ళు తప్పుకోవడానికీ కలిపి ప్రతి రోడ్డు మీదా పదేసి పన్నెండేసి అడుగుల జాగాలు వదిలేరు. ఈ పక్కనించి మైకుల్లో గణపతి పూజలకి సంబంధించిన శబ్దాలూ, ఆపక్కనించి వాహనాల హారన్ల మోతలూ, మెయిన్‌రోడ్డు నుంచి మా వాళ్లింటికున్న దూరం ఒకటిన్నర కిలోమీటర్లే. ఐతే అసలు దారిలో ఆటో కూడా వెళ్లలేనంత ఇరుకు. అంచేత కొంత దూరం దాకా తీసికెళ్లి ఇంక ముందుకు వెళ్లడం సాధ్యపడక; ఆ సందు పట్టి, ఈ సందులో వెళ్లి - మొత్తం అయిదు కిలోమీటర్లు తిరగడమైంది. అప్పుడూ కూడానూ, మావాళ్ల ఇల్లు ఒక ఫర్లాంగు ఉందనగా అక్కడ ఆటో ఆగిపోయింది, పద్మవ్యూహంలో అభిమన్యుడి రథంలాగ. "ఇంక వెళ్లలేం సార్! దిగిపోయి నడిచెయ్యండి" అన్నాడు డ్రయివరు. పోనీ వెనక్కి తిప్పి ఇంకో సందులో గుండా వెళదామన్నా సరిగ్గా ఫర్లాంగు అవతల ఇంకో గణపతి మందిరం ఉంది.

"ఇక్కడ గణపతి నవరాత్రులు ఉత్సవాలు బాగా జరుగుతున్నట్టున్నాయే!" అని మా అన్నయ్య కూతురు సీతతో అన్నాను. నా మాటలో వెటకారం ఏమీ లేకపోయినా మా

సీత మొహం ముడుచుకుపోయింది. "ఏమిటి చెయ్యడం, అనుభవించవలసిందే!" అంది.

"అప్పుడే మొదలెట్టేవూ, సొద!" అంటూ గదిలోంచి ఇవతలికొచ్చేడు, మా అన్నయ్య అల్లుడు సుధాకర్‌రావు. "మామయ్యగారూ, నాకు తప్పినా మీకు తప్పదు ఇవాళ. చెప్పిందిగా మీ అమ్మాయి, అనుభవించవలసిందే. నాకు బైట పన్లున్నాయి గాని, ఈవిడ లెక్చర్లు మీరే వినుకోండి!" అని నవ్వుతూ వీధి గుమ్మం వేపు నడిచేడు.

"అదేమిటి, ఇవాళ సెలవూ, విఘ్నేశ్వర చవితీ కదా, పూజలు చెయ్యడం అదీ మానేసి బైట పనులా?" అన్నాను. "అన్నీ ఆవిడే చెప్తుంది!" అని వెళ్లాడు.

"ఈయనకి పండుగలూ, సెలవులూ ఉండవు బాబాయి. వినాయకుడి బొమ్మలు పెట్టి పందిళ్లు వేసినవాళ్లు ఎక్కడెక్కడ పర్మిషన్ లేకుండా కరెంటు వాడుతున్నారో లిస్టు రాసుకుని రిపోర్టు తయారు చెయ్యాలి. ప్రతీ ఏడూ ఇదొక తతంగం. మైకులు పని చెయ్యడానికీ, రంగు రంగుల దీపాలు వెలగడానికీ పేట పేటా వీధి వీధీ ఎలక్ట్రికల్ లైన్లలోంచి దొంగతనంగా వైరింగులు చేస్తారు. కొన్ని చోట్ల లోడు ఎక్కువై ఫ్యూజులు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడం, సప్లయి ఆగిపోవడం జరుగుతాయి. ఈయన లైనుమాన్లనీ వాళ్లనీ, తీసుకెళ్లి తణికీలు చెయ్యాలి. ఏ ఒంటిగంట వేళప్పుడో ఇంటికొచ్చి శుక్లాంబరధరం విష్ణుం అంటూ ఐదు నిమిషాల్లో పూజ అయిందనిపిస్తారు" అని చెప్పింది సీత.

"పండుగ సందర్భంగా కరెంటు వాడుకునే అవసరం ఉన్న వాళ్లు అప్లికేషన్లు పెట్టి నూరు రూపాయలు కడితే పర్మిషన్ ఇస్తాం అని ఈ ఏడాది ప్రత్యేకంగా ఎనౌన్సుమెంటు చేసి దానికోసం కౌంటర్లు కూడా పెట్టారు. ఐనా సరే అప్లికేషన్లు ఏమీ రాలేదుట. దొంగతనంగా కరెంటు వాడ్డం మరిగిన వాళ్లు అప్లికేషన్లు ఎందుకు పెడతారు?" అంది సీత.

'ఇంకా చాలా ఉంది, అదంతా నిలబడి చెప్పడం కష్టం!' అన్న ధోరణిలో కుర్చీ లాక్కుని కూచుంది; సీత.

"వినాయక చవితితో మొదలుపెట్టి తొమ్మిది రోజులు ఈ వూళ్లో నరకం చూస్తాం. చూసేవుగా, మా ఇంటికి ఇటువేపు ఒక పందిరీ అటువేపు ఒకటీ. వీళ్లూ మైకు పెడతారు వాళ్లూ పెడతారు. ఒకటో రెండో దొరికిన కాడికి భక్తిపాటలు పెట్టి ఆ తరువాత అంతా సరికొత్త సినిమాల్లోవి; వీలున్నంత అపసవ్యపు పాటలు తగిలిస్తారు. దేవుడి పూజకి ఆ అసందర్భమైన పాటలు పెట్టకూడదన్న జ్ఞానం ఉండదు. ఈ పందిట్లో వాళ్లు తెలుగులో వొచ్చే అసభ్యమైన పాటలు వేస్తే ఆ పందిట్లో వాళ్లు హిందీలో వొచ్చేవి పెడతారు.

"ఈ వేడుకలన్నిటికీ డబ్బు బాగా ఖర్చవుతుంది కదా. ఎవళు పెట్టుకుంటారు?"

"పండుగ నెల రోజులు ఉందనగా వొసూళ్లు ప్రారంభిస్తారు. మనవేపూ ఉందిగా, ఈ పద్ధతి! అయితే ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే మనకి తెలిసిన వాళ్లో మన వీధిలో ఉన్న వాళ్లో కాక వొసూళ్ల కోసం వేరే రకం మనుషులు వస్తారు. వాళ్లని చూడగానే వాళ్లు

చెప్పినంత చందా ఇచ్చీవలసిందే. లేకపోతే వాళ్లే స్వతంత్రంగా బీరువాతాళాలు అడిగి పుచ్చుకొని అందులోంచి వాళ్లకి తోచినంత పట్టుకుపోతారు."

"దొంగలా?"

"అబ్బెబ్బే; దొంగలైతే రాత్రిపూట వస్తారు. వీళ్లు పట్టపగలే పట్టపగ్గాల్లేకుండా వస్తారు, వెళతారు. నిమజ్జనం అని ఒకటి వస్తుంది; ఆఖరి రోజున. ఇది మనవాళ్లు బొంబాయి నుంచి తెచ్చుకున్న సంప్రదాయం. మనవేపు చిన్న చిన్న బొమ్మలకి పూజలు చేసి చవితినాడు సాయంకాలమో మర్నాడో మూడో నాడో అణుపు పెడతాం. ఇక్కడ ఎంత పెద్ద బొమ్మకి పూజ చేస్తే అంత గొప్ప భక్తి అన్నమాట. ఈ ఏడాది ఈ పేట వాళ్లు 30 అడుగుల ఎత్తు విగ్రహం తయారుచేస్తే ఒచ్చే ఏడాది ఆ పేటవాళ్లు 40 అడుగులది తయారుచేసేరన్నమాటే. ఇహ ఈ తొమ్మిది రోజులూ పూజ పేరుతో నానా అల్లరీ చేసి ఆఖరు రోజుని నిమజ్జనం చేస్తారు. కొన్ని లక్షల విగ్రహాలు హుసేన్‌సాగర్‌లో ముంచుతారు. ఏ రోడ్డూ ఖాళీ ఉండదు. లారీలు, ట్రక్కులూ, వాటినిండా రవుడీలూ, గూండాలూ.'

"రవుడీలూ, గూండాలూ ఎందుకు? భక్తులు చాలరా?"

"నిజమైన భక్తులైతే నా భక్తి గొప్పదంటే నాది గొప్పదని చాటుకోరు. అలా చాటుకునే వాళ్లు నిజమైన భక్తులు కారు కూడాను. ఈ చాటుకోవడంలో పౌరుషాలూ, పరువు ప్రతిష్ఠలూ భక్తిని పక్కకి తోసేసి విజృంభిస్తాయి. తిట్టుకుంటారు. కొట్టుకుంటారు. చంపుకుంటారు. నిమజ్జనం నాటి సాయంకాలం వార్తలు ఈ వూళ్లో ఒక ప్రత్యేకత; ఫలానా ఇంత మంది చచ్చిపోయారనీ, ఫలానా ఇన్ని ఆస్పత్రులు నిండిపోయేయనీ, హిందూ మతం, ధర్మం; అంటూ వీరంగం చేసే రాజకీయ పార్టీ ఒకటి వీళ్లందరికీ అండగా ఉంటుంది."

"అయితే వినాయక చవితి అనేది ఈ వూళ్లోపండగ మాత్రమే కాకుండా పరువు ప్రతిష్ఠలకో, పౌరుషాలకో, బలప్రదర్శనకో వేదిక కూడా అన్నమాట. అంతేనా?"

"ఒక్క వినాయక చవితే ఏమిటి? దీని తరువాత దసరా వస్తుంది. అదీ పరువు ప్రతిష్ఠ వేదికే. హోలీ అని ఒకటీ, రాఖీ పౌర్ణమి అని ఒకటీ, ఉత్తర హిందూస్థానం నుంచి దిగుమతి చేసుకున్నారు ఇక్కడివాళ్ళు. హోలీనాడు ఊళ్లోకెవరూ పనిమీద వెళ్లరు; వెళ్లినా ఆ షేపుల్లో తిరిగిరారు. హోలీ అంటే వసంతపౌర్ణమి అని నువ్వు చెప్తూ ఉండేవాడివి. మన్మథుడి ఫ్రెండైన వసంతుడి రుతువు వస్తోందన్న సంబరంలో, "వరసైన వాళ్లు" ఒకరిమీదొకరు 'వసంతం' అనే ద్రవాన్ని చిలకరించుకుంటారని కూడా నువ్వే చెప్పావు.... మా హైద్రాబాద్‌లో హోలీనాడు ఎవరు పడితే వారు; వారికి ఎవరి మీద ప్రేమ వుందో ఎవరి మీద కసి ఉందో అలాంటి వాళ్లందరి మీదా ఈ ద్రవాల్ని జల్లుకోవచ్చు. 'వసంతం' అనే ద్రవం తేట తేట సున్నపునీళ్లల్లో ఎంతో తక్కువ పసుపు కలిపితే తయారవుతుంది. ఆ లేత ఎరుపు (కుంకుమ) రంగు ద్రవం శుభసూచకం, క్రిమిసంహారకం కూడాను. మా హైద్రాబాద్ 'హోలీ లిక్విడ్స్' కొంచెం అటూ ఇటూగా ఏసిడ్సంత పవర్‌ఫుల్‌గా వుంటాయి. మొహాల మీద, జుట్టు మీద;

బట్టల మీద - విచక్షణా రహితంగా వొంపుకొనే ఆ ద్రవాలూ ఆ రంగులూ వొదిలించుకోడం ఎంతో కష్టం. అలాగే రాఖీల పండుగ నాడు ఈ చేత్తో రాఖీ కట్టించుకుని ఆ చేత్తో ఇంకోటేదో చేసే ఉత్సాహవంతులున్నారిక్కడ."

"అంటే; పండుగనాడు ఎవళ్ల మట్టుకు వాళ్లు ఇళ్లలో 'ఇష్టదేవతా ప్రార్థన్లు చేసుకుని కలిగిన కాడికి ఇంతతిని కులాసాగా గడిపే సంస్కృతి ఇక్కడలేదంటావా?"

"లేదనే చెప్పాలి. మనవేపు సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి, వరలక్ష్మీ వ్రతం, శ్రావణపౌర్ణమి, కృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా, దీపావళి, నాగులచవితి ఇలా ఏడాది పొడుగుతా వొచ్చే పండుగలన్నీ ఇల్లాళ్ల చేతుల్లో, గృహిణుల చేతుల్లో నడుస్తాయి. ఇక్కడ పండుగలు రవుడీల చేతుల్లో, గూండాల చేతుల్లో నడుస్తాయి. అంతే తేడా."

వీధి గుమ్మంలో సుధాకర్‌రావు స్కూటర్ ఆపిన చప్పుడు వినిపించేటంత వరకూ సీత అలా చెబుతూనే ఉంది హైదరాబాద్‌లో పండుగలు చేసుకునే పద్ధతిని గురించి.

*ఇది 1992లో వినాయకచవితి (సారీ: 'గణేష్ చతుర్థి')కి తరవాత కొన్ని రోజులకి ("నిమజ్జన్ కీ పహలే") ఒక డెయిలీ పేపర్లో ప్రచురించేరు. ఆ రోజంతా భక్తులు ఆ పత్రిక ఎడిటర్‌గార్ని ఫోన్ మీద బెదిరిస్తూనే తమ తమ పూజాదికాలు నిర్వర్తించేరు. దాంతో, "నిన్నటి పేపర్లో ఫలానా (ఈ) కథ ప్రచురించడం తప్పయిపోయింది, క్షమించండి భక్తుల్లారా!" అని వొక ఎపాలజీ ఫ్రంట్ పేజీలో (కొంచెం పెద్ద అచ్చులో) వేసేరు.*